క్లుప్తంగా

25న కంటి వైద్యశిబిరం

పుంగనూరు: ఈనెల 25న పట్టణంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చెంగారెడ్డి గురువారం తెలిపారు. చెన్నైకు చెందిన శంకర్ నేత్రాలయ వైద్య నిపుణులు వైద్య పరీక్షలు చేస్తారని, ఉదయం 9 గంటల నుంచి శిబిరం ప్రారంభమవుతుందన్నారు. కంటి జబ్బులు కలిగిన వారు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



పుంగనూరు: పట్టణ సమీపంలోని భీమగానిపల్లె క్రాస్ వద్ద ఉన్న శ్రీవీరాంజనేయ స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్ పాల్గొన్నారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

పుంగనూరు: ప్రభుత్వం రెవెన్యూ చట్టంలో మార్పులు చేయడంపై న్యాయవాదులు శుక్రవారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు విధులు బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. గురువారం న్యాయవాదుల సంఘ కార్యదర్శి ఆనందకుమార్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సమావేశమయ్యారు. ప్రభుత్వం చేసిన చట్టంతో టైటిల్‌ను నిర్ణయించే అధికారం కోర్టుల నుంచి తీసివేయడం బాధాకరమన్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచించి కోర్టులలోనే టైటిల్‌ను నిర్ణయించే విధంగా మార్పు చేయాలని విజ్ఞప్తి చేశారు.

'ఉపాధి' సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఏపీఓ దినకర్ బాబు

సోమల: ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ దినకర్ బాబు కోరారు. శుక్రవారం మండలంలోని 81 చిన్న ఉప్పరపల్లె, వల్లిగట్ల పంచాయతీలలో ఉపాధి హామీ గ్రామ సభలు నిర్వహించారు. రానున్న 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధిలో హార్టికల్చర్‌తో పాటు డ్రాగన్ ఫ్రూట్, మునగను రైతులు సాగు చేసుకోవచ్చన్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ వంద రోజుల పనిదినాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పలమనేరు ఎస్ఐగా సురేష్



పలమనేరు: పలమనేరు టౌన్ ఎస్ఐగా సురేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ సుబ్బారెడ్డి బదిలీపై కుప్పానికి వెళ్లారు. పూతలపట్టు నుంచి బదిలీపై సురేష్ ఇక్కడికి వచ్చారు. తొలుత ఆయన పలమనేరు డీఎస్పీ సుధాకర్ రెడ్డి, అర్బన్ సీఐ చంద్రశేఖర్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎస్ఐగా సుబ్బారెడ్డి



కుప్పం రూరల్: కుప్పం ఎస్ఐగా సుబ్బారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. పలమనేరు నుంచి ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న శివకుమార్ రామకుప్పంకు బదిలీ అవడం విదితమే. సుబ్బారెడ్డి మాట్లాడుతూ, కుప్పంలో శాంతి భద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తామని చెప్పారు.

ఈరోజు

మండల సమావేశం

సోమల: మండల సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ ఈశ్వరయ్య అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ నాగరాజ గురువారం తెలిపారు. మండల, గ్రామ స్థాయి అధికారులు పూర్తి నివేదికలతో రావాలని, ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరు కావాలని కోరారు.

ఆలయానికి భూమి పూజ

శాంతిపురం: పంచాయతీ కేంద్రమైన కర్లగట్టలో ధర్మరాజుల స్వామి ఆలయ నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ నిర్వహించనున్నట్టు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ బుల్లెట్ దండపాణి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి జరిగే పూజల్లో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్ పాల్గొంటారని చెప్పారు. ధర్మరాజుస్వామి ఆలయ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.1.10 కోట్లను మంజూరు చేయడం విదితమే.

మున్సిపాలిటీలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

కుప్పం రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని 5, 6 వార్డులైన తంబిగానిపల్లె, అనిమిగానిపల్లెలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

దర్జాగా ప్రభుత్వ స్థలాల విక్రయం!

- తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగుల చేతివాటం
- ప్రభుత్వ స్థలంలో ప్లాట్ ధర రూ.లక్ష!

జగనన్న పక్కా గృహాలను అవకాశంగా తీసుకుని తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులు రియల్ ఎస్టేట్ వ్యాపారుల అవతారం ఎత్తారు. జగనన్న కాలనీల పక్కన ప్రభుత్వ స్థలాలను ప్లాట్లుగా విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు తూట్లు పొడుస్తూ, అడ్డదారులు తొక్కుతున్నారు. నిరుపేదలకు మొండిచెయ్యి చూపుతున్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగి కుటుంబ సభ్యులకు ఇచ్చిన నాలుగు ప్లాట్లలో చేస్తున్న భవన నిర్మాణ పనులు

కుప్పం: కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని పేదలకు ప్రభుత్వం 2 వేలు పైగా కాలనీ గృహాలు ప్రభుత్వం మంజూరు చేసింది. వీరందరికీ స్థలాలు లేకపోవడంతో 9వ వార్డు మోడల్ కాలనీ వద్ద పలార్లపల్లె, బేవనపల్లె రెవెన్యూ పరిధిలో ప్రభుత్వం స్థలాన్ని కేటాయించారు. ఈ స్థలంలో రెండు లే అవుట్లు వేసి జగనన్న కాలనీ గృహాల నిర్మాణానికి పూనుకున్నారు. అయితే ఈ కాలనీ సమీపంలోని ప్రభుత్వ స్థలాలను దర్జాగా దొడ్డిదారిన విక్రయిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. ప్రధానంగా మున్సిపల్ పరిధిలోని ఒక రెవెన్యూ పట్టా రూ.లక్ష రూపాయలు పలుకుతోండటం చూస్తే వీళ్ల అక్రమార్జన ఏ స్థాయిలో ఉందో ఇట్టే బోధపడుతుంది.

తహసీల్దార్ కార్యాలయంలోని కంప్యూటర్ విభాగంలో కాంట్రాక్టు పద్ధతిలో ఓ వ్యక్తి పని చేస్తున్నాడు. ఇతనికి అమరావతి కాలనీ ఎదురుగా ఖాళీగా ఉన్న ప్రభుత్వం స్థలంలో నాలుగు ఇంటి పట్టాలు రెవెన్యూ శాఖ మంజూరు చేసింది. కంప్యూటర్ ఉద్యోగి పేరిట ఒకటి, ఉద్యోగి అమ్మ పేరిట మరొకటి, చెల్లెళ్ల పేరిట రెండు ప్లాట్లను పొందాడు. వీటిలో నాలుగు ఇళ్లు నిర్మించేందుకు జగనన్న కాలనీ గృహాల కోసం దరఖాస్తు చేశారు. ఆన్‌లైన్ పద్ధతిలో వారికి ఇల్లు మంజూరు కాలేదు. దీంతో చేసేదేమీ లేక ఆ ఉద్యోగి నాలుగు ప్లాట్ల స్థలంలో పెద్దగా పునాదులు వేసి భవన నిర్మాణానికి పూనుకున్నాడు. ఒకే వ్యక్తి కుటుంబానికి నాలుగు ఇళ్ల స్థలాలు ఇవ్వడంపై విమర్శలొస్తున్నాయి.



బేవనపల్లె రెవెన్యూలో వేసిన లేఅవుట్‌లో కుంజేగానురు గ్రామ వాసికి ఇచ్చిన ప్లాట్‌లు

మోడల కాలనీలోనూ ఇదే తంతు

మున్సిపాలిటీ పరిధి మోడల్ కాలనీ సమీపంలోని బేవనపల్లె రెవెన్యూ స్థలంలోని జగనన్న కాలనీలో రెండు ప్లాట్లను అక్రమంగా విక్రయించారు. మండలంలోని రూరల్ ప్రాంతం కుంజేగానూరుకు చెందిన ఓ వ్యక్తికి వీటిని విక్రయించడంతో ప్రస్తుతం ఆ స్థలాల్లో ఇంటి నిర్మాణానికి పునాదులు వేస్తున్నారు. వాస్తవానికి ప్రభుత్వ కాలనీ ఇళ్లకు ఆ వ్యక్తి అర్హుడు కాదు. అయిననూ రెవెన్యూ శాఖ అధికారులు ఏ ప్రాతిపదికన అతడికి స్థలాలు ఇచ్చారో పైవాడికే ఎరుక.

ప్లాట్ కావాలంటే లక్ష!

మున్సిపాలిటీ పరిధిలోని డీకేపల్లె, మోడల్ కాలనీ పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలను దర్జాగా విక్రయిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రూ.లక్ష ఇస్తే సంబంధిత శాఖ ఉద్యోగులు పట్టా ఇస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. ఈ ప్రాంతంలో ప్రభుత్వం భూములు అధికంగా ఉండడంతో కాలనీ ఇక్కడే నిర్మించారు. ఇదే అవకాశంగా చేసుకుని రెవెన్యూ పట్టాలు చేతులు మారుతున్నాయి. తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసే అధికారులే సూత్రధారులనే విమర్శలొస్తున్నాయి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు

మా ఆఫీస్‌లో పనిచేసే ఉద్యోగికి కుటుంబ సభ్యులకు ప్లాట్‌లు ఇవ్వడం వాస్తవమే. కానీ వాటి మంజూరుతో నాకు సంబంధం లేదు. నేను కుప్పంకు రాక ముందు రెండేళ్ల క్రితం ఇచ్చారు. బేవనపల్లె రెవెన్యూ పరిధిలో కుంజేగానూరు గ్రామస్తులకు రెండేళ్ల కిత్రం ఇచ్చినవే ..దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం.

– పార్వతమ్మ, తహసీల్దార్ , కుప్పం

కబడ్డీ కూతకు వేళాయె..



విజేతలకు ఇవ్వడానికి సిద్ధం చేసిన ట్రోఫీలు, జ్ఞాపికలు

- నేటి నుంచి అండర్–17 రాష్ట్ర స్థాయి బాలబాలికల పోటీలు
- 13 ఉమ్మడి జిల్లాల నుంచి రానున్న 500మంది క్రీడాకారులు

చౌడేపల్లె: అండర్–17 రాష్ట్ర స్థాయి కబడ్డీ క్రీడా పోటీలకు సర్వం సిద్ధం చేసినట్లు కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టి. రామచంద్ర గురువారం తెలిపారు. ఈనెల 24వ తేదీ శుక్రవారం నుంచి మూడురోజులపాటు బాలురు, బాలికలకు ఈ పోటీలను నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి 13 జిల్లాలనుంచి దాదాపు 500మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్టు పేర్కొన్నారు. చౌడేపల్లె ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. బాలికలు, బాలుర కోసం వేర్వేరుగా రెండేసి కబడ్డీ కోర్టులు సిద్ధం చేశారు. రాత్రి పూటసైతం ఫ్లడ్ లైట్ల వెలుగుల్లోనూ ఆటల పోటీలు నిర్వహణకు ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థుల బృందం ఆధ్వర్యంలో క్రీడా ప్రాంగణంలో అన్ని వసతులు కల్పించినట్టు చెప్పారు.

విజేతలకు ట్రోఫీలు సిద్ధం

క్రీడల్లో మొదటి, రెండవ, మూడవ స్థానాల్లో విజయం సాధించిన జట్లకు ట్రోఫీలతో పాటు జ్ఞాపికలు, పతకాలు ఇవ్వనున్నట్టు రామచంద్ర తెలిపారు. రాజంపేట, చిత్తూరు పార్లమెంట్ సెగ్మెంట్ యూత్ అధ్యక్షుడు మిద్దింటి కిషోర్‌బాబు, పిల్లారి జీవన్ ప్రకాష్, సర్పంచ్ వరుణ్ భరత్ సహకారంతో జ్ఞాపికలు సిద్ధం చేశారు. అలాగే ప్రతిభ చాటే ప్రతి జట్టుకు తగిన బహుమతులు ఇస్తామన్నారు. కార్యర్యమ్రంలో క్రీడా పోటీల అబ్జర్వర్ రాంబాబు, స్కూల్ గేమ్స్ మాజీ కార్యదర్శి మల్‌రెడ్డి, పీడీలు వెంకటేష్, నితిన్, అజయ్, చంద్ర, అమరనాథ్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి కబడ్డీ క్రీడా పోటీలకు సిద్ధమైన క్రీడా ప్రాంగణం

రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు

- మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా

పుంగనూరు: మున్సిపాలిటీలోని 31 వార్డుల్లో రోడ్లు, కాలువలు, పైపులైన్ల ఏర్పాటుకు రూ.20 కోట్లతో అభివృద్ధ పనులు చేయాలని కౌన్సిల్‌లో చర్చించి, ఆమోదించినట్లు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. గురువారం కమిషనర్ నరసింహప్రసాద్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అజెండాను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. చైర్మన్ మాట్లాడుతూ, మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి ప్రభుత్వం నుంచి 20 కోట్ల రూపాయలను అభివృద్ధి కోసం మంజూరు చేయించారన్నారు. మున్సిపాలిటీలో 142 పనులను గుర్తించి, పనులు ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. విస్తరణ ప్రాంతాలలో కూడా పనులు చేపడుతామని తెలిపారు. మున్సిపాలిటీని అన్ని విధాల అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమన్నారు. ఎంబీటీ రోడ్డు విస్తరణ, పుంగమ్మ చెరువు వద్ద పార్కు ఏర్పాటు పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. ఆయా వార్డులలో అవసరమైన పనులను కౌన్సిలర్లతో గుర్తించి వేగవంతంగా పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్లు లలిత, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా

కరాటేలో బంగారు పతకాలు సాధించారు



కరాటేలో ప్రతిభ కనబరచిన విద్యార్థులతో మన్సూర్ బాషా

పుంగనూరు: కరాటే పోటీల్లో 10 బంగారు పతకాలను జిల్లా క్రీడాకారులు సాధించారని స్కాయ్ జిల్లా జనరల్ సెక్రటరీ మన్సూర్ బాషా తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ, జిల్లాస్థాయి కరాటే పోటీల్లో అన్నమయ్య జిల్లా మదనపల్లెలో నిర్వహించామన్నారు. జిల్లా తరఫున 10 మంది ఉత్తమ ప్రతిభ కనబరచి బంగారు పతకాలు సాధించారన్నారు. గెలుపొందిన వారిని అల్లూరి సీతారామరాజు జిల్లాలో డిసెంబర్ 11న రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్కాయ్ రాష్ట్ర చైర్మన్ ఇస్మాయిల్, కోచ్ ఫారుక్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురిపై కేసు నమోదు

బైరెడ్డిపల్లె: కైగల్ దుముకురాళ్ల జలపాతం వద్ద మంగళవారం జరిగిన ఘర్షణకు సంబంధించి ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మోహన్‌కుమార్ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. బైరెడ్డిపల్లెకు చెందిన నస్రీన్‌తాజ్ తన భర్తతో కలిసి దుముకురాళ్ల జలపాతం వద్దకు వెళ్లారు. కై గల్ గ్రామానికి చెందిన సురేష్ ద్విచక్రవాహనాల గేటును వేలంలో దక్కించుకున్నాడు. దీంతో ద్విచక్రవాహనానికి గేటు ఇవ్వాలని కోరాడు. దీంతో వారి మధ్య గొడవ మొదలై ఘర్షణకు దారితీసింది. నస్రీన్‌తాజ్ ఫిర్యాదు మేరకు సురేష్‌తో పాటు భూపతి, మురళి, బాలాజి, వై.బాలాజి, శివపై కేసు నమోదు చేశారు.

నేటి నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్'

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో శుక్రవారం నుంచి 16 రోజుల పాటు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తొలుత భగత్‌సింగ్‌కాలనీలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. ప్రతి వార్డు సచివాలయంలో సంక్షేమ పథకాల వివరాలు, లబ్ధిదారుల వివరాలు, అందించిన నగదు, తదితర వివరాలతో డిజిటల్ బోర్డులు ప్రారంభిస్తామన్నారు. ఆయా వార్డు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నోడల్ టీచర్‌కు అభినందన



చంద్రశేఖర్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సోమల: కందూరు ఉన్నత పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్ రాష్ట్ర స్థాయిలో ఎంపికై ప్రశంసలు అందుకున్నట్టు హెచ్‌ఎం వెంకటరమణారెడ్డి గురువారం తెలిపారు. రాష్ట్రంలో 577 ప్రభుత్వ అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఉండగా 31 ల్యాబ్‌లను ఎంపిక చేశారన్నారు. వీటిలో తమ స్కూలుకు చెందిన ల్యాబ్ కూడా ఒకటని, విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి సదస్సులో నోడల్ ఉపాధ్యాయుడు, ల్యాబ్ ఇన్‌చార్జి చంద్రశేఖర్ వివిధ ప్రాజెక్టులను ప్రదర్శించడంతో ఆయనను అభినందిస్తూ జ్ఞాపికతోపాటు ప్రశంసా పత్రం అందజేశారని తెలిపారు. ఆయనను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

జగనన్నను ఆశీర్వదించండి



చౌడేపల్లె: గడ్డంవారిపల్లెలో..



సోమల: తమ్మినాయనిపల్లెలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ

చౌడేపల్లె: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న జగనన్న ప్రభుత్వానికి మద్దతునిచ్చి రానున్న ఎన్నికల్లో మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఎంపీపీ రామమూర్తి విజ్ఞప్తి చేశారు. గురువారం గడ్డంవారిపల్లె సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే.. కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పథకాల లబ్ధి వివరాలతో ఏర్పాటు చేసిన బోర్డును ప్రారంభించారు. అలాగే బస్టాండు వరకు ర్యాలీగా వెళ్లి పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యవతి, ఎంపీటీసీ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు

సోమల: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ ఈశ్వరయ్య అన్నారు.గురువారం మండలంలోని తమ్మినాయనిపల్లె సచివాలయ పరిధిలో సర్పంచ్ సురేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీతోపాటు ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్,నాగేశ్వరరావు మాట్లాడారు. పంచాయతీలో ప్రతి ఇంటికి లబ్ధి చేకూర్చుతూ వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా నాలుగున్నరేళ్ల కాలంలో రూ.12.91 కోట్లు ఖర్చు చేసినట్టు చెప్పారు. పంచాయతీ అభివృద్ధికి ఇంత మొత్తంలో నిధులు, వివిధ సంక్షేమ పథకాలు అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం డిజిటల్ బోర్డు, పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సయ్యద్ బాషా మండల వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు నాగభూషణం రెడ్డి, సచివాలయ కన్వీనర్లు శ్రీనివాసులు, హరిప్రసాద్, ఉషారాణి, మాజీ సర్పంచ్ తిమ్మయ్య, వెంకటరమణ, సోషల్ మీడియా నియోజకవర్గ కో–కన్వీనర్ షేక్ బాషా తదితరులు పాల్గొన్నారు.



సదుం: కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు, గ్రామస్తులు

సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

సదుం: పేదల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి అన్నారు.. మండలంలోని పాలమందలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం గురువారం నిర్వహించారు. సంక్షేమ పథకాల బోర్డు, పార్టీ జెండా, కరపత్రాలను ఆవిష్కరించారు. సంక్షేమ పథకాల గురించి ఇంటింటింటికీ వెళ్లి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మనోహర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ శివారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు మాధవి, గురుప్రసాద్‌రెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా కుల గణన సర్వే



కుల గణనపై శిక్షణ ఇస్తున్న ఎంపీడీఓ అబ్దుల్ రహీం

పెద్దపంజాణి: కుల గణన సర్వే పక్కాగ చేయాలని ఎంపీడీఓ అబ్దుల్ రహీం ఆదేశించారు. అమ్మరాజుపల్లె సచివాలయంలో గురువారం సచివాలయ సిబ్బందికి, వలంటీర్లకు కుల గణనపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 27 నుంచి ప్రారంభమయ్యే కుల గణన సర్వేలో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు కులం, ఉపకులం తదితర వివరాలను క్షేత్రస్థాయిలో సర్వే చేసి, ముగింపులో తప్పనిసరిగా ఈకేవైసీ చేయాలన్నారు. తదుపరి నాగిరెడ్డిపల్లె సచివాలయాన్ని ఎంపీడీఓ తనిఖీ చేశారు. కార్యాలయంలోని సిబ్బంది హాజరు పట్టికను, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శారదాదేవి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విలేకరులపై చర్యలు తీసుకోరూ!

- యూట్యూబ్ విలేకరులంటూ దందా, వసూళ్లు
- ఆర్డీఓ, డీఎస్పీ, ఎంపీడీఓ, తహసీల్దార్‌కు ఫిర్యాదు



ఆర్డీఓ మనోజ్‌కుమార్ రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న అక్రిడేటెడ్ జర్నలిస్టులు

పలమనేరు: తాము కూడా అక్రిడేషన్ ఉన్న విలేకరులమంటూ కొందరు పలమనేరులో అధికారులను తప్పుదారి పట్టిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని పలమనేరు వర్కింగ్, అక్రిడేటెడ్ జర్నలిస్టులు గురువారం స్థానిక ఆర్డీఓ మనోజ్‌కుమార్ రెడ్డి, డీఎస్పీ సుధాకర్ రెడ్డి, ఎంపీడీఓ విద్యాసాగర్, తహసీల్దార్ కుప్పుస్వామి, సీఐ చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. వర్కింగ్ జర్నలిస్టుల నేతలు ఆదిశేషయ్య, రమేష్, నాగరాజు మాట్లాడారు. నిబంధనలకు వ్యతిరేకంగా కొందరు సొంతంగా యూట్యూబ్‌లో వార్తలు పెడుతున్నారని, అలాగే పీడీఎఫ్ ఫార్మెట్‌లో వార్తలను పెట్టి అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. మీడియా పేరిట వీరు చేస్తున్న అక్రమ దందాల కారణంగా నిజమైన జర్నలిస్టులకు అవమానాలు తప్పడం లేదని వాపోయారు. అక్రిడేషన్ మంజూరు చేసిన జర్నలిస్టులను గుర్తించకుండా ఇలాంటి యూట్యూబ్ వారిని పెంచి పోషిస్తున్న అధికారులకు కనీసం అక్రిడేషన్‌పై కనీస పరిజ్ఞానం ఉందా? అని ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులు సైతం నకిలీ విలేకరుల బారిన పడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. అక్రిడేషన్ కలిగిన వారికి మాత్రమే అధికారిక కార్యక్రమాల సమాచారం ఇస్తామని, యూట్యూబ్ విలేకరులకు ఇక ఇవ్వబోమని అధికారులు హామీ ఇచ్చినట్టు చెప్పారు. నకిలీ, యూట్యూబ్ విలేకరులపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తామని డీఎస్పీ సుధాకర్ రెడ్డి తమ వినతిపై స్పందించినట్టు చెప్పారు.

ఖరీఫ్ వేరుశనగ రైతులను గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ శివకుమార్

రొంపిచెర్ల: ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగు చేసిన రైతులను గుర్తించి రైతు భరోసా కేంద్రంలోని నోటీస్ బోర్డులో ప్రదర్శించాలని వ్యవసాయశాఖ పుంగనూరు డివిజన్ ఏడీ శివకుమార్ ఆదేశించారు. గురువారం ఆయన రొంపిచెర్ల–2 రైతు భరోసా కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగు చేసిన రైతులు తీవ్ర వర్షాభావంతో తీవ్రంగా నష్టపోయారన్నారు. దీనిని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం రొంపిచెర్లను కరువు మండలంగా ప్రకటించిందన్నారు. ఆర్‌బీకేలలో ఉన్న ఎరువులను రైతులు ఉపయోగించుకునేలా చూడాలన్నారు. రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులను కూడా గుర్తించి రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. అలాగే తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వచ్చే పంటలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో మండల వ్యవసాధికారి సుధారాణి, ఆర్‌బీకే ఇన్‌చార్జులు వెంకటరమణ నాయక్, సుజాత, శ్రావణి, నర్మద, రేఖ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

3న వికలాంగుల ర్యాలీ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బాల గురునాథ్

వి.కోట: డిసెంబర్ 3వ తేదీన వికలాంగుల దినోత్సవం పురస్కరించుకుని వి.కోటలో నిర్వహించ తలపెట్టిన ర్యాలీని విజయవంతం చేయాలని వికలాంగుల సంఘ మండల అధ్యక్షుడు నాగరాజు కోరారు. ర్యాలీ కరపత్రాలను గురువారం మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ బాలగురునాథ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ర్యాలీలో అఖిలపక్ష నాయకులు, పట్టణ ప్రముఖులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ప్రజాప్రతినిధులకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శంకర్ పాల్గొన్నారు.

ఏకాదశి పూజలు



సుబ్రమణ్యస్వామి ఆలయంలో పూజలు

సదుం: మండలంలోని పలు ఆలయాల్లో కార్తీక ఏకాదశి పూజలు గురువారం నిర్వహించారు. స్థానిక వీరభద్ర, సుబ్రమణ్యస్వామి, అరుణాచలేశ్వరస్వామి ఆలయం, నడిగడ్డ మత్తుకువారిపల్లె మల్లీశ్వరస్వామి ఆలయాల్లో అభిషేకాలు, పూజలు చేశారు. ఏకాదశి నోములు నిర్వహించారు. వ్రత కల్పాన్ని అర్చకులు వివరించారు.